భక్తి శ్రద్ధలతో గోదాదేవి పల్లకీ సేవ

రామన్నపేటలో గోదాదేవి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

రామన్నపేట, డిసెంబర్ 24: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం చెన్నకేశవస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి మాతను పల్లకీలో పద్మశాలి వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో అమ్మవారికి స్వాగతం పలికారు. టెంకాయలు, పసుపు కుంకుమలు సమర్పించారు. మహిళలు పల్లకిని మోసి భక్తిని చాటుకున్నారు. ఈసందర్భంగా మోటె నర్సింహ, కల్పన దంపతులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్, ఎంపీటీసీ వనం హర్షిని చంద్రశేఖర్, సింధం లింగయ్య, పెండెం భవనారుషి, మురళి, యశ్వంత్, రాము, జెల్ల నరేష్, దొంత సత్తయ్య, బోడ సుదర్శన్, గంజి అశోక్, చంద్రగిరి వెంకటేష్, ఎం సురేందర్, చల్లమల్ల కిశోర్ పాల్గొన్నారు.

పద్మశ్రీ కల్యాణ సుందరాన్ని కలిసిన ఎన్జీ అధ్యాపకులు ఆనందం దుర్గాప్రసాద్

మ్యాన్ ఆఫ్ మిలీనియం పద్మశ్రీ కల్యాణ సుందరంను కలిసిన ఎన్జీ కళాశాల గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్

రామగిరి, డిసెంబర్ 24: పద్మ శ్రీ అవార్డు గ్రహీత కల్యాణ సుందరాన్ని ఆదివారం చెన్నైలోని ఆయన నివాసంలో నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (ఎన్జీ) గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 36 ఏండ్లుగా కల్యాణ సుందరం గ్రంథ పాలకులుగా పనిచేసి పదవి వీరమణ పొందిన తర్వాత వచ్చిన రూ. 18 లక్షలను అనాథశ్రమాల్లోని పేద విద్యార్థుల విద్య కోసం దానం చేశారు. దీంతో ఆయనను అమెరికా ప్రభుత్వం మ్యాన్ ఆఫ్ మిలినీయం అవార్డు ప్రకటించి అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ రూ.30కోట్ల నగదును అందించింది. సుందరం జీవిత చరిత్ర నేటి తరానికి అందించాలనే సంకల్పంతోనే ఆయనను కలిసినట్లు దుర్గాప్రసాద్ తెలిపారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం

పాట్టబత్తిని బాలరత్నం

చౌటుప్పల్ రూరల్, డిసెంబర్24: చౌటుప్పల్ మండల పరిధిలోని ఉమ్మడి కొయ్యలగూడెం పద్మశాలి సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటుచేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా బాలరత్నం, ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణా, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ. కోశాధికారిగా గోవర్ధన్‌తో పాటు మరికొంత మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఈశ్వరమ్మ, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గడ్డం జయశంకర్, మాజీ సర్పంచ్ మాచర్ల కృష్ణ, నాయకులు నర్సింహ్మ, హరేకృష్ణా పాల్గొన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

కట్టంగూర్, డిసెంబర్ 24: మండలంలోని పరడ గ్రామంలో ఆదివారం తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... యాదయ్య వృత్తి రీత్యా గీత కార్మికుడు. ఉదయం వ్యవసాయ బావి వద్ద తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింది పడ్డాడు. గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కామినేని దవాఖానకు తరలించారు.

మానస విహార్ కాలనీ నివాస సంక్షేమ సంఘం కమిటీ

నీలగిరి, డిసెంబర్ 24. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లోని మానస విహార్ కాలనీ నివాస సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం కమ్యూనిటీ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చక్రపాణి, అధ్యక్షుడిగా రిటైర్డ్ హెచ్ఎం ఆర్.నీలంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మణాచారి, కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా ఆర్.కిరణ్‌కుమార్, సభ్యులుగా కె.మీనారెడ్డి, సీహెచ్. సతీష్‌కుమార్‌ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు రిటైర్డ్ సహకార అధికారి చక్రపాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

మానస విహార్ కాలనీ నివాస సంక్షేమ సంఘం కమిటీ బృందం

ప్రజలపై నిత్యం అయ్యప్ప స్వామి కృప

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- మునుగోడులో అయ్యప్ప స్వామి మహా పడి పూజ

అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, డిసెంబర్ 24: ప్రజల పై అయ్యప్ప స్వామి కృప తప్పకుండా ఉంటుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద అయ్యప్ప మాలధారులు ఆదివారం ఏర్పాటు చేసిన అయ్యప్ప మహాపడి పూజ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయ్యప్ప స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వారి పడిపూజ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత, రాష్ట్ర నాయకులు నారబోయిన రవిముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, భీమనపల్లి సైదులు పాల్గొన్నారు.

చౌటుప్పల్: మండల కేంద్రంలోని సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం అయ్యప్ప మాల ధారులకు అన్నదానం చేశారు. వేల్పూరి శ్రీలక్ష్మి, మధుబాబు దంపతులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాలధారులు బొబ్బిళ్ల మురళి, తూర్పాటి శంకర్, చింతల సాయిలు, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, అంతటి రాముగౌడ్, ఆంజనేయులు, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్, డిసెంబర్ 24 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వ కర్మ యోజన పథకం మొదటి దశలో రూ. 13వేల కోట్లు కేటాయించారని అన్నారు. వడ్రంగి, స్వర్ణకారులు, కుమ్మరి వృత్తిదారులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

27న అయ్యప్ప మండల పూజ

కట్టంగూర్, డిసెంబర్ 24: మండల కేంద్రంలోని సాయి మణికంఠ దేవాలయంలో ఈ నెల 27న అయ్యప్ప స్వామి మండల పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ గురుస్వామి గాదగోని వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా గణపతి పూజ, ఆభిషేకాల అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాయికుమార్ మృతిపై విచారణ జరిపించాలని ఎస్పీకి వినతి

నీలగిరి, డిసెంబర్ 24. నల్లగొండ పట్టణంలో కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి సాయికుమార్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా ఎస్పీ అపూర్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ ఇంటర్ సెకండియర్ చదువుతున్న సాయికుమార్ రైలు పట్టాలపై శవమై కనిపించాడని తెలిపారు. ఎవరో ఫోన్ చేస్తే రాత్రిపూట హాస్టల్ నుంచి వెళ్లినట్లు తెలుస్తుందని, అతను వెళ్లే సమయంలో ఎవరూ పట్టించుకోలేదని అన్నారు. హాస్టల్‌లో కనీసం వాచ్‌మెన్ కూడా లేడని, రాత్రి విద్యార్థి అక్కడ నుంచి ఎలా వెళ్లాడు. ఎవరైనా తీసుకెళ్లారా. శవమై తేలడానికి గల కారణాలు ఏమిటో దర్యాప్తు చేపట్టాలని కోరారు. అతని స్నేహితులను, వారి ఫోన్ కాల్ డేటాను సమగ్రంగా విచారణ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో కాలేజీ హాస్టళ్ల నుంచి విద్యార్థులు ఇష్టారాజ్యంగా బయటికి వెళ్తున్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా హనుమాన్ వ్రతం

వ్రతంలో పాల్గొన్న భక్తులు

రామగిరి, డిసెంబర్ 24: ధనుర్మాసం, హనుమాన్ దీక్షల ముగింపులో భాగంగా ఆదివారం నల్లగొండలోని తులసీనగర్‌లోని భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం తెల్లవారు జామున 'హనుమాన్ వ్రతం' ఘనంగా నిర్వహించారు. ప్రధాన గర్భాలయం ఎదురుగా ప్రాకార మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో అర్చకులు హరీశ్‌శర్మ, శివప్రసాద్ శర్మతో పాటు అర్చక స్వాముల పూజలు చేశారు. హనుమాన్ దీక్ష స్వాములతోపాటు భక్తులు హాజరై స్వామి తిలకించారు. హనుమాన్ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ వేడుకల్లో ఆలయ కార్యాలయ అధికారులు శేఖర్, గోదాదేవి, భక్తులు పాల్గొన్నారు.

నేడే క్రిస్మస్

- విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న క్రిస్టియన్లు

నల్లగొండ: విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మరియరాణి చర్చి

రామగిరి, డిసెంబర్ 24: క్రిస్టియన్లకు అత్యంత పవిత్రమైన పండుగ క్రిస్మస్. వేడుక సోమవారం జరుగనుంది. ఇప్పటికే వారం రోజులుగా సెమీ క్రిస్మస్ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రధాన చర్చిలతో పాటు అన్ని ప్రార్థనా మందిరాలను సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. మరో వైపు ఇండ్లపై స్టార్లను పెట్టారు. శాంతాక్లాజ్‌ల గిఫ్ట్‌లతో చిన్నారులు సందడి చేస్తున్నారు. సోమవారం క్రిస్మస్ సందర్భంగా అన్ని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు, కేక్ కటింగ్‌లు చేయనున్నారు.

నల్లగొండ : క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న సిస్టర్స్